బాబోయ్ మోటార్ల దొంగలు

- ఆందోళనలో రైతులు
- కాపర్ వైరు టార్గెట్‌గా చోరీలకు పాల్పడుతున్న దుండగులు

గోవిందరావుపేట: పంట పొలాల వద్ద ఉన్న విద్యుత్ మోటార్లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్తున్నారు. గురువారం అర్ధరాత్రి మండల పరిధిలోని పస్రా గ్రామ శివారులో పంట పొలాల వద్ద ఉన్న ఏడు మోటార్లను దొంగలు ఎత్తుకెళ్లడంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. మోటార్లలో ఉండే కాపర్ వైరుని టార్గెట్‌గా చేసుకొని చోరీలకు పాల్పడుతున్నారు. మార్కెట్‌లో కాపర్ వైరు కేజీకి రూ.2500 నుంచి రూ.3000 వరకు ఉంది. కాగా, దొంగతనం చేసిన వైరుని రూ.1000 నుంచి రూ.1500లకు విక్రయిస్తుంటారు. గ్రామ శివారులో వరి పంట పొలాలకు లక్నవరం చెరువులో నుంచి సాగునీరు అందక పంట పొలాలు ఎండిపోతుండడంతో గుండ్లవాగులోకి మోటార్లు ఏర్పాటు చేసుకొని రైతులు నీరు పారిస్తున్నారు. గ్రామ శివారు కావడం జనాలు ఎవరూ ఉండని సమయం చూసుకొని యథేచ్ఛగా గుర్తు తెలియన వ్యక్తులు దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇప్పటికే పలుమార్లు మోటార్లను దొంగలు



మోటార్లు చోరీకి గురైనట్లు తెలుపుతున్న రైతులు

ఎత్తుకెళ్లారు. సుమారు ఈ మోటార్లు ఒక్కొక్కటీ రూ.30 వేల వరకు విలువ ఉంటుందని రైతులు తెలుపుతున్నారు. ఈ విషయమై పస్రా పోలీస్ స్టేషన్‌లో బాధిత రైతులు ఫిర్యాదు చేయగా స్పందించిన పస్రా ఎస్సై కమలాకర్ ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు. గతంలో కూడా ఇదే తరహాలో చాలా మోటార్లు పోయాయని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా పోలీసులు మోటార్ల దొంగలను పట్టుకోవాలని కోరుతున్నారు.



పస్రా గుండ్లవాగు దగ్గర మోటారులోని కాపర్‌ని తీసుకెళ్లిన దొంగలు

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

గోవిందరావుపేట: మండల పరిధిలోని చల్వాయి మోడల్ స్కూల్‌లో తెలుగు బోధించుటకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వి. రామచందర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ వరకు బోధించుటకు ఆసక్తి కలిగి, అర్హతలు కలిగి ఉన్న అభ్యర్థులు పూర్తి వివరాలతో కూడిన బయోడేటాతో పాటుగా అన్ని సర్టిఫికేట్లు జిరాక్స్ కాపీలను ఈ నెల 29లోగా కళాశాలలో సమర్పించాలి అని అన్నారు. ఎంఏ, బీఈడీ చేసి ఉన్న వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. డెమో, ఇంటర్వ్యూ, విద్యార్హతలు, అనుభవం ఆధారంగా ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు.

తాగునీటి నాణ్యతపై శిక్షణ



వాజేడు: తాగునీటి ప్రమాణాలపై శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శైలజ, ములుగు జిల్లా కేంద్రం నుంచి వచ్చిన శిక్షకుడు నీటి నాణ్యతను ఎలా తెలుసుకోవాలో వివరించారు. తాగు నీటి ప్రమాణాలను తగ్గకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు.

గొత్తికోయలకు దుప్పట్ల పంపిణీ



వెంకటాపురం(ఎం): మండలంలోని రోలుబండ గొత్తికోయలకు శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో దుప్పట్లు పంపిణీ చేసినట్లు ఎస్సై జక్కుల సతీశ్ తెలిపారు. ఈ సందర్భంగా గొత్తికోయలతో ఎస్సై మాట్లాడుతూ.. ఎలాంటి సమస్య ఉన్న పోలీసులకు సమాచారం అందిస్తే పరిష్కారిస్తామన్నారు. గూడెంలో ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలన్నారు.

వాహనాల తనిఖీ



వెంకటాపురం(కె): మండల పరిధిలోని యాకన్నగూడెం గ్రామ శివారుల్లో శుక్రవారం వెంకటాపురం సీఐ బండారి కుమార్, ఎస్సై కొప్పుల తిరుపతి రావుల ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. అనుమానిత వ్యక్తులు తారస పడితే వారి వద్ద నుంచి పూర్తి స్థాయి సమాచారాన్ని సేకరించి పంపిస్తున్నారు. ఈ తనిఖీల్లో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్య పనులు



వాజేడు: మండల పరిధిలోని నాగారం, వాజేడు, జంగాలపల్లి గ్రామాల్లో శుక్రవారం గ్రామ పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని మోరీలను శుభ్రం చేయడంతో పాటు గ్రామాల్లో ఉన్న చెత్తను తొలగించారు.

నలుగురికి జైలు

మల్లూర్: ట్రాక్టర్ దొంగతనం చేసిన ఇద్దరు వ్యక్తులతో పాటు కొనుగోలు చేసి వ్యక్తి, విక్రయించడానికి సహకరించిన వ్యక్తిని పట్టుకోని మొత్తం నలుగురిని జైలుకు పంపించినట్లు కొయ్యూరు ఎస్సై నరేష్ శుక్రవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. తాడిచర్ల గ్రామ శివారులో జూన్ 7న వ్యవసాయ పొలాల వద్ద ఉంచిన టాక్టర్‌ను తాడిచర్ల గ్రామానికి చెందిన మహేందర్, రాజు దొంగలించారు. సుల్తానాబాద్‌కి చెందిన స్వామి ద్వారా ముల్కనూర్‌కి చెందిన అశోక్‌కు విక్రయించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొయ్యూ రు పోలీస్‌లు విచారణ చేపట్టి ట్రాక్టర్‌ని స్వా ధీనం చేసుకోని స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ దొంగిలించిన ఇద్దరు వ్యక్తులను, దొంగ ట్రాక్టర్‌ను కొనుగోలు చేసిన వ్యక్తి, సహకరించిన వ్యక్తిని జైలుకి పంపించినట్లు వెల్లడించారు.

అప్రమత్తంగా ఉండాలి

కాళేశ్వరం: సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. శుక్రవారం మహదేవపూర్ మండల కేంద్రంలోని బట్టి కాలనీలో ప్రజలకు సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. గుర్తుతెలియని వ్యక్తులకు బ్యాంకు ఆధార్ వ్యక్తిగత వివరాలను తెలుపొద్దన్నారు. కార్యక్రమంలో పోలీసులు, ప్రజలు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ



ర్యాలీ నిర్వహిస్తున్న మనం సొసైటీ సభ్యులు

ఏటూరునాగారం: మొక్కలను పెంచి మానవ మనుగడను కాపాడాలని మనం సొసైటీ వెల్ఫేర్ అధ్యక్షుడు చౌళం శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ నుంచి బస్టాండ్ వరకు సొసైటీ సభ్యులు, విద్యార్థులు ప్లాస్టిక్ నిర్మూలించాలని, మొక్కలను నాటాలని, పచ్చదనం పరిశుభ్రత పాటించాలని ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెత్తకుండీలను ఉపయోగించుకొని వ్యర్థాలను అందులో వేయాలని, ప్రకృతి, భూతాపాన్ని తగ్గించాలన్నారు. అడవులను రక్షించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమాదేవి, సిబ్బంది రవీందర్, చౌళం వికాస్, కుర్సం శశికుమార్, వివేక్, రవి, రాజన్న, శ్రీను, రాణి, రాములు, సరళ, వాణిశ్రీతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ చట్టాలను అమలు చేయాలి

వెంకటాపురం(కె): ఏజెన్సీ చట్టాలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని గొండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో గొండ్వానా సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీ చట్టాలను అమలు చేయాలని కోరుతూ ఈ నెల 30న భద్రాచలం ఐటీడీఏ ఎదుట నిర్వహించే రిలే నిరహార దీక్షలను విజయవంతం చేయాలని కోరారు. ఏజెన్సీలో బోగస్ కులధ్రువీకరణ పత్రాలతో అక్రమంగా ఉద్యోగ అవకాశాలు పొందటం వల్ల ఆదిమ తెగలకు అన్యాయం జరుగుతుందని అన్నారు. ఏజెన్సీ చట్టాలను అమలు చేసే వరకు ఉద్యమం కొనసాగించాలని అన్నారు.

పర్యాటకరంగ అభివృద్ధిలో యువత కీలకం



బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ నవీన్

ఏటూరునాగారం: పర్యాటక రంగ అభివృద్ధిలో యువత కీలకపాత్ర పోషించాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ నవీన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టూరిజం శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధి, ప్రచారం కోసం ప్రతీ స్కూల్, కళాశాలలో యువ టూరిజం క్లబ్బులను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏటూరునాగారంలో యువ టూరిజం క్లబ్‌ను అధ్యాపకుడు వెంకటయ్య కోఆరినేటర్‌గా 26 మంది విద్యార్థులతో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. యువ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించామన్నారు. అనంతరం ఉపన్యాస పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. యువ టూరిజం క్లబ్ కోఆర్డినేటర్ సిహెచ్ వెంకటయ్య, అధ్యాపకులు జ్యోతి, కనీస్‌ఫాతిమా, సంపత్, రమేష్, శేఖర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి



ములుగు రూరల్: మాట్లాడుతున్న నాయకులు



వాజేడు: మాట్లాడుతున్న గణేశ్

ములుగు రూరల్: అటవీశాఖ అధికారులపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఆదివాసీ ఉద్యోగ సంఘం నాయకుడు అన్నవరం రవికాంత్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తాడ్వాయి రేంజ్ పరిధి దామెరవాయి అటవీ ప్రాంతంలో విధి నిర్వహణలో భాగంగా జేసీబీని కార్యాలయానికి తరలిస్తున్న అధికారులపై దాడి చేసిన వారిపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మంకిడి రవి, రేగ నరేందర్, అరెం నారాయణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏటూరునాగారం: ఆదివాసీ ఫారెస్టు ఉద్యోగి సోలం శరత్‌పై దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఐటీడీఏ ఆదివాసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆలూరి వెంకటేశ్వర్లు, కార్యదర్శి పెనక కృష్ణమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన ఆదివాసీ ఉద్యోగుల సమావేశంలో వారు మాట్లాడారు. గురువారం తాడ్వాయి రేంజ్ దామెరవాయి అటవీ ప్రాంతంలో అడవిని పోడు చేస్తుండగా విధి నిర్వహణలోభాగంగా జేసీబీని స్వాధీనం చేసుకోని అటవీశాఖ రేంజ్ కార్యాలయానికి తరలిస్తున్న ఎఫ్ఎస్ఓ వినోద్, ఎఫ్‌బీఓ శరత్‌ల తలపై రాడ్డుతో మొది, చేతివేళ్లను విరిచిన దుండగులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాక భాస్కర్, కంటెం లక్ష్మీనారాయణ, పున్నం రమేష్, మోకాళ్ల లక్ష్మీ, చెల నాగమణి, కాక సమ్మక్క, కొమురం ప్రభాకర్, తాటి నర్సింహులు, ఈక కిరణ్, ఊరెపెద్ది మల్లేష్, సిద్దబోయిన నిర్మలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురం(కె): అటవీ శాఖ అధికారులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఆదివాసీ నవ నిర్మాణ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు నర్సింహామూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తాడ్వాయి మండలంలోని దామరవాయి అడవుల్లో విధుల్లో ఉన్న ఫారెస్టు అధికారిపై గిరిజనేతరులు దాడి చేయటంపై ఆయన ఖండించారు. విధి నిర్వహణలో దుండగులచే దాడి చేయబడ్డ సోలం శరత్‌కు మెరుగైన వైద్య సేవలను అందించాలని అన్నారు.

దాడి చేసిన వ్యక్తులపై చర్య తీసుకోవాలి

వాజేడు: అటవీ శాఖ ఉద్యోగిపై దాడి చేసిన గిరిజనేతర వ్యక్తులపై చట్ట పరంగా చర్యలను తీసుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు రేగ గణేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని బొల్లారం గ్రామంలో శుక్రవారం కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. తాడ్వాయి మండలంలోని దామరవాయి అటవీ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న అధికారులపై గిరిజనేతరులు దాడి చేసి గాయపర్చడం దారుణమన్నారు. ఆయనతో బొల్లారం గ్రామస్తులు ఆదివాసీ సంక్షేమ పరిషత్ కార్యకర్తలు ఉన్నారు.

తోటలను సందర్శించిన అధికారులు



తోటలను పరిశీలిస్తున్న నాబార్డు అధికారి రవి

వెంకటాపురం(కె): మండలంలోని రాచపల్లి, పాత్రాపురం, టేకుల బోరు, అబ్బాయిగూడెం, ముత్తారం, కె.కొండాపురం, ఎదిర గ్రామాల్లోని నాబార్డు సహకారంతో వన సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మా తోటలను శుక్రవారం వరంగల్ క్లస్టర్ నాబార్డు అధికారి తుంగ రవి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు యాజమాన్య పద్ధతులను వివరించారు. మా తోటల్లో అంతర్ పంటలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా తోటల ద్వారా రైతులకు 56 మామిడి, 22 జామ, 70 టేకు మొక్కలను ప్లాంటేషన్‌గా ఇవ్వటం జరుగుతుందని అన్నారు. ఈ ప్రాజెక్టులో 111 గ్రామాల్లో 450 మంది గిరిజన రైతులకు పండ్ల తోటల పెంపకం 50 మంది నిరుపేద కుటుంబాలకు పాడి పశువులు, మేకలు, గొర్రెలు, టైలరింగ్, లేడీస్ ఎంపోరియం కిరాణాషాపు, మిని రైస్ మిల్లు ఎంపిక చేసి ఇవ్వటం జరుగుతుందని తెలిపారు.

దోమల నివారణ మందు పిచికారీ



మందును పిచికారీ చేస్తున్న సిబ్బంది

వాజేడు: మండల పరిధిలోని ప్రగళ్లపల్లి గ్రామంలో శుక్రవారం దోమల నివారణ మందును పిచికారీ చేశారు. గ్రామంలోని ప్రతీ ఇంటిలో దోమల నివారణ మందుని పిచికారీ చేసి వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి జ్వరాలపై ఆరా తీశారు. ప్రతీ ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు ఉషారాణి

కన్నాయిగూడెం : ప్రజలు పోషకాలతో కూడిన ఆహార పదార్థాలు తీసుకుంటే ఆరోగ్యం సంపూర్ణంగా ఉంటుందని స్థానిక వైద్యురాలు ఉషారాణి అన్నారు. మండలంలోని రాజన్నపేట, సర్వాయి, సబ్ సెంటర్ పరిధిలోని గ్రామాల్లో డాక్టర్లు వైద్య శిబిరం నిర్వహించారు. పోషక అభియాన్‌లో భాగంగా పోషకాహార లోపంతో ఉన్నవారిని గుర్తించి వారికి వైద్యపరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉషారాణి మాట్లాడుతూ సరైన ఆహార పదార్థాలు తీసుకోకపోవడంతోనే పోషక లోపం ఏర్పడుతుందన్నారు. వరల్డ్ హార్ట్‌డే ను పురస్కరించుకొని గుండె పని విధానం, దాంతో కలిగే ఉపయోగాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు అవగాహన కలిపించారు. బీపీ, షుగర్ పరీక్షలు చేసి పలు సూచనలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రణీత్ కుమార్, బంగారు వరప్రసాద్, అంగన్ వాడీ టీచర్లు, సూపర్ వైజర్ పుష్పలత, హెల్త్ అసిస్టెంట్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా జయంతి



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఏటూరునాగారం : స్థానిక షిరిడీ సాయిబాబా దేవాలయంలో శుక్రవారం బాబా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు ఎల్లాప్రగడ భాను ప్రకాష్ శర్మ, కమిటీ ఆధ్వర్యంలో పంచామృత అభిషేకాలు, అర్చనలు, పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బాబా జయంతి సందర్భంగా ప్రత్యేకంగా తయారు చేసిన కళాకంద్ కోవా కేక్ కటింగ్ చేశారు. అనంతరం మధ్యాహ్నం హారతి తర్వాత అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. అనంతరం అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో చైర్మన్ పెండ్యాల ప్రభాకర్, ఉపాధ్యక్షుడు కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి బచ్చు సతీశ్, కోశాధికారి వెంకట్రావు, సహాయ కార్యదర్శి గంజి రమేష్, ఆలయ పర్యవేక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ఆకుల వారి గణపురం ప్రాంతానికి చెందిన బాలిక కంకణాల గీతిక విష జ్వరంతో బాధపడుతూ వరంగల్ ఎంజీఎంలో ఇటీవల మృతి చెందింది. మల్యాల పవన్, మున్నాల ద్వారా విషయాన్ని తెలుసుకున్న వరంగల్‌కు చెందిన యువ నేతాజీ ఫౌండేషన్ ప్రధాన సభ్యుడు గజ్జెల సుమన్, కొత్తకొండ అరుణ్ కుమార్, అలవాలపృధ్వి రూ.15వేలను సేకరించి బాధిత కుటుంబానికి శుక్రవారం అందజేశారు. శ్రీరామ్, సుమన్, అజహరుద్దీన్, స్వేమ్మర్‌రాజు, సృజన, రాంప్రసాద్, జ్యోతి, రవికుమార్, తదితరులు ఉన్నారు.

దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు



పనులు ప్రారంభిస్తున్న మోహన్ కుమార్

ములుగు రూరల్: జిల్లా కేంద్రంలో దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవ ఏర్పాట్లను ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు బండారి మోహన్‌కుమార్ ప్రారంభించారు. ఈ మేరకు శుక్రవారం రామాలయ ఆవరణలో వేడుకల నిర్వహణకు పనులను అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డితో కలిసి కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 17 సంవత్సరాలుగా దుర్గా మాత వేడుకలు నిర్వహిస్తున్నామని అన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. జిల్లాకేంద్రంలో ఈ నెల 03 నుంచి వేడుకలు ప్రారంభమవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో గట్ల శ్రీనివాస్, బాణాల రాజ్‌కుమార్, ఆవుల ప్రశాంత్‌రెడ్డి, చిన్నకొండారెడ్డి, ఓడ రాజు, రాకేష్‌యాదవ్, దొంతి రాకేష్‌రెడ్డి , నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర సంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన



భూమి పూజ చేస్తున్న వెంకటకృష్ణ, వడ్డెర కుల సంఘం సభ్యులు

గోవిందరావుపేట: మండల పరిదిలోని చల్వాయి గ్రామంలో శుక్రవారం వడ్డెర సంఘం భవనానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వెంకటకృష్ణ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు చల్వాయి గ్రామంలోని వడ్డెర కుల సంఘానికి కమ్యూనిటీ భవనం నిర్మిస్తానని ఇచ్చిన మాట ప్రకారం మంత్రి సీతక్క భవనాన్ని మంజూరు చేశారన్నారు. భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో భూమి పూజ నిర్వహించి, శంకుస్థాపన చేశామని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం వడ్డెర కుల సంఘ భవనం మంజూరు చేసిన సీతక్కకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి తేళ్ల హరిప్రసాద్, మాజీ ఎంపీటీసీ చాపల ఉమాదేవి నరేందర్ రెడ్డి, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వేల్పుగొండ ప్రకాశ్, వడ్డెర కుల సంఘం సభ్యులు పిట్టల సమ్మయ్య, ఎల్లయ్య, శివరాత్రి భిక్షపతి, పిట్టల వెంకటేష్ పాల్గొన్నారు.

రూ.10లక్షల పరిహారం చెల్లించాలి

ఏటూరునాగారం: ములుగు మండలం ఇంచర్లలోని ఐటీడీఏ గిరిజన ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కన్నాయిగూడెం మండలం రాజన్నపేటకు చెందిన కోరం చరణ్ జ్వరంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈ మృతికి పాఠశాల యజమాన్యం బాధ్యత వహిస్తూ విద్యార్థి కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా నాయకుడు దబ్బకట్ల శ్రీకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జ్వరంతో బాధపడుతున్న విద్యార్థిని ఏమాత్రం పట్టించుకోకుండా ఉపాధ్యాయులు వారి ఇష్టానుసారంగా వ్యవహరించారన్నారు. ఆలస్యంగా పాఠశాల యాజమాన్యం విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వగా విద్యార్థి తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లి ఆస్పత్రికి తీసుకువెళ్తున్న క్రమంలో విద్యార్థి మృతి చెందినట్లు ఆరోపించారు. ఐటీడీఏ పీఓ విధుల్లో చేరి ఎనిమిది నెలలు కావస్తున్నా పాఠశాల స్థితిగతులపై విద్య, వైద్యంపై పట్టించుకోవడం లేదన్నారు. పీఓ స్పందించి విద్యార్థిపై నిర్లక్ష్యం వహించిన ఉపాధ్యాయులపై చర్య తీసుకోవాలని కోరారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



చుంచుపల్లిలో బీమా చెక్కు అందజేస్తున్న బడే నాగజ్యోతి

మంగపేట: మండలంలో పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి శుక్రవారం పరామర్శించారు. మండలంలోని నర్సింహాసాగర్ గ్రామానికి చెందిన మంగపేట పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాడబోయిన నరేందర్ తల్లి ఐలమ్మ ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా మృతురాలు చిత్రపటం నివాళులర్పించారు. అలాగే కోమటిపల్లి బీఆర్ఎస్ నాయకుడు ఊడుగుల నర్సయ్య కుమారుడు రాకేశ్ ఇటీవల మృతి చెందగా కుటుంబ సభ్యులను పరామర్శించారు.

బీఆర్ఎస్ బీమా చెక్కుల పంపిణీ

బీఆర్ఎస్ సభ్యత్వం తీసుకుని కొద్ది నెలల క్రితం మృతి చెందిన పార్టీకి చెందిన ఇద్దరు పార్టీ కార్యకర్తల కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.2 లక్షల బీమా చెక్కులను శుక్రవారం నాగజ్యోతి అందజేశారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చుంచుపల్లి గ్రామానికి చెందిన బోడ శ్రీను, కమలాపురం గ్రామానికి చెందిన బందెల సాంబయ్య కుటుంబాలకు బీమా చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఆపార్టీ మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారయణ, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ తోట రమేశ్, మాజీ ఆత్మ చైర్మన్ దుర్గం రమణయ్య, జిల్లా సీనియర్ నాయకులు తుమ్మ మల్లారెడ్డి, నాయకులు రాజు యాదవ్, జగదీష్, శంకర్, సుకుమార్, తిరుపతి, బద్రయ్య, చందర్రావు, ఈసం రామ్మూర్తి, ఊడుగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి



బాపూజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

వెంకటాపురం(ఎం): మండలంలోని నర్సాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఎస్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్‌టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏళ్ల మధుసూదన్, ఉపాధ్యాయులు మంజుల, కవిత, విమల, సాంబయ్య, జవహర్, ఆయకయ్య, రవీందర్‌లు పాల్గొన్నారు.